ఒక శాతం సెస్ జమ చేయాలి : డిఆర్‌ఒ

ప్రజాశక్తి-విజయనగరం కోట

ప్రభుత్వ సంస్థల ఆధ్వర్యంలో జరిగే నిర్మాణ పనులకు సంబంధించి కాంట్రాక్టర్లకు చెల్లించే బిల్లుల్లో ఒక శాతం సెస్‌ను ప్రతి నెల నిర్మాణ మండలికి అందజేయాలని డిఆర్‌ఒ అనిత తెలిపారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళ వారం భవన, ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ సెస్ చట్టం 1996పై సమీక్షా సమావేశం నిర్వహించారు. సెస్ వసూలుపై సమన్వయ కమిటీ సమావేశంలో పాల్గొన్న డిఆర్‌ఒ మాట్లాడుతూ పలు నిర్మాణ పనులు చేపట్టే ప్రభుత్వ శాఖలు, ప్రభుత్వరంగ సంస్థల అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, భవన, ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ సెస్ చట్టం కింద ప్రతి ప్రభుత్వ, ప్రైవేట్ భవన, ఇతర నిర్మాణాల మీద వచ్చే ఆదాయంలో ఒక శాతం సెస్‌ను మండలికి జమ చేయాలన్నారు. సమావేశంలో కార్మిక శాఖ ఉప కమిషనర్ సుబ్రహ్మణ్యం, పరిశ్రమల శాఖ జి.ఎం పాపా రావు, పలు శాఖలకు చెందిన అధికారులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పాలకొండ శంఖారావ సభలో మాట్లాడుతున్న నారా లోకేష్

ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ ఇసుక దందా

- భూకబ్జాలూ పెచ్చుమీరాయి
- అధికారంలోకి వస్తే ఏనుగుల సమస్య పరిష్కారం
- జీవో 3 అమలు చేస్తాం
- పూర్ణ పాడు-లాబేసు వంతెన పూర్తి చేస్తాం
- శంఖారావం సభల్లో నారా లోకేష్

ప్రజాశక్తి-పాలకొండ, కురుపాం, గరుగుబిల్లి

వైసిపికి చెందిన పాలకొండ, కురుపాం ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ ఇసుక దందాలకు పాల్పడుతూ ప్రజాధనాన్ని లూటీ చేస్తున్నారని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ విమర్శించారు. టిడిపి అధికారంలోకి వస్తే ఏజెన్సీని ఏళ్లతరబడి పీడిస్తున్న ఏనుగుల సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. గిరిజనులకు ఉపయోగపడే జీవో 3 అమలు చేస్తామని ప్రకటించారు. అవినీతి అధికారులు, వైసిపికి చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల ఆగడాలు కట్టిస్తామని అన్నారు. పాలకొండ, కురుపాంలో ఆయా నియోజకవర్గాల ఇన్‌ఛార్జులు నిమ్మల జయకృష్ణ, తోయిక జగదీశ్వరి అధ్యక్షతన జరిగిన శంఖారావం సభల్లో నారా లోకేష్ మాట్లాడారు. జగన్ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలేవీ అమలు చేయలేదని అన్నారు. సంపూర్ణ మద్య పాన నిషేధం అంటూ మాట తప్పిన ముఖ్య మంత్రి అని ఎద్దేవా చేశారు. 40ఏళ్లు దాటిన ఎస్‌టిలకు పింఛను ఇస్తానని చెప్పి మోసం చేశారన్నారు. జిల్లాలో సుగర్ ఫ్యాక్టరీలను తెరిపిస్తానని చెప్పి మాట తప్పారన్నారు. బాంబులకే జడని కుటుంబం తమదని, జగన్‌పెట్టే కేసులకు భయపడేది లేదని అన్నారు.

టిడిపి అధికారం లోకి వస్తే ఏనుగులు సమస్యకు పరిష్కారం చూపుతామన్నారు. ఎన్నో ఏళ్లగా గిరిజనుల కలగా ఉన్న పూర్ణ పాడు - లాబేసు వంతెన నిర్మాణం పూర్తి చేస్తామని, గుమ్మిడి గెడ్డ ను నిర్మిస్తామని తెలిపారు. పార్టీ కోసం ఎక్కువ కష్టపడి కేసులు భరించిన వారిని గుర్తించి నామిటెడ్ పదవులు అందిస్తామన్నారు. విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణ చేయడానికి జగన్ రెడ్డే తెరలేపారని, ఎంతో ఉత్తరాంధ్రకు అవసరమైన ఉక్కుకర్మాగారాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ఉందని అన్నారు. టిడిపి అధికారంలోకి వస్తే రాష్ట్ర ప్రభుత్వమే దాన్ని తీసుకుని నడిపించి కార్మికులకు అండగా నిలుస్తుందని అన్నారు. ఐటిఐ కళాశాల, పాలిటెక్నికల్ కళాశాల, తోటపల్లి అధునీకరణ పనులు పూర్తి చేస్తామని, లిఫ్టు ఇరిగేష్ పనులకు నిధులు కేటాయిస్తామని తెలిపారు. జగన్ పాలనలో తొమ్మిది సార్లు కరెంట్ బిల్లులు, మూడు సార్లు ఆర్టీసీ చార్జీలతోపాటు ఇంటి పన్నులు, చెత్త పన్నులు కూడా విపరీతంగా పెంచేశారన్నారు. చివరికి రానున్న రోజుల్లో గాలి పన్ను కూడా విధిస్తారని ఎద్దేవా చేశారు. విశాఖ పట్టణంలోని ప్రజాధనంతో రూ.500 కోట్లు ఖర్చు పెట్టి ప్యాలెస్ నిర్మాణం చేసుకున్నారని, తాము అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజాఅవసరాలకు వినియోగిస్తా మన్నారు. ఇంకా ఎన్నికలకు రెండు నెలలు మాత్రమే సమయం ఉందని, కార్యకర్తలంతా కష్టపడి జనసేన, టిడిపి మద్దతు తెలిపిన ఉమ్మడి అభ్యర్థిని గెలిపించి జగన్ రెడ్డి గద్దెదించాలని పిలుపునిచ్చారు.

ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు అవినీతిపరులు

ఒకరిని గెలిపిస్తే..పాలకొండ నియోజకవర్గంలో ఇద్దరు ప్రజాప్రతినిధులు వచ్చి ప్రజల మీద పడి దోచుకుంటున్నారని నారా లోకేష్ ఆరోపించారు. ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ పట్టణంలోని డిగ్రీ కళాశాల దగ్గర విలువైన స్థలాన్ని కబ్జాకు పాల్పడ్డారని ఆరోపించారు. ఇసుక దందాలు చేసుకుంటున్నారన్నారు. ఒకరు నాగావళి నది నుంచి ఇసుకను దోచుకోగా, మరొకరు వంశధార నది నుంచి ఇసుక దోపిడీ చేస్తున్నారన్నారు. రెండుసార్లు కళావతిని ఎమ్మెల్యేగా గెలిపిస్తే ప్రజలకు ఆమె చేసినదేమీ లేదన్నారు. నియోజకవర్గ సమస్యలను పూర్తిగా గాలికి వదిలేశారన్నారు.కురుపాం ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి, ఆమె భర్త పరీక్షిత్‌రాజు, ఆమె బావ రమేష్ అడ్డంగా దోచుకుంటున్నారని ఆరోపించారు. ఇసుక దోపిడీతోపాటు ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను అమ్ముకుంటున్నారని విమర్శించారు.

పాలకొండ నియోజకవర్గ ఇన్‌ఛార్జి నిమ్మక జయకృష్ణ మాట్లాడుతూ నియోజకవర్గంలో సమస్యలను పాలకులు పట్టించుకోవడం లేదన్నారు. పాలకొండ వెనుకబాటుతనానికి ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలే కారణమన్నారు. నియోజకవర్గంలో భూ కబ్జాలు, ఇసుక మాఫియా వారి కన్నుసన్నల్లోనే సాగుతుందన్నారు. రెండేసి మండలాలను ఇద్దరు సర్దుకుని దోచుకుంటున్నారని ఆరోపించారు. స్థానిక నగర పంచాయతీలో కోట్లు విలువైన స్థలం ఎమ్మెల్సీ విక్రాంత్ కబ్జాలు చేయగా, ఎమ్మెల్యే కళావతి వండువలో 33 ఎకరాలు చెరువును కబ్జా చేశారన్నారు. గిరిజనులు అవసరమైన జీవో నెంబరు3ను పక్కా అమలు చేయాలని, నియోజకవర్గంలో ఐటీఐ, డిప్లమా కళాశాలు ఏర్పాటు చేయాలని, ఇరిగేషన్ ప్రాజెక్టులకు పూర్తి చేయాలని నారా లోకేష్‌ను కోరారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ నిమ్మల ఇబ్రం మాట్లాడుతూ వైసిపి పాలనలో పని చేసే వారు తక్కువ అయ్యారని, దోచుకునే వారు ఎక్కువయ్యారని అన్నారు. అరుకు పార్లమెంటరీ ఇన్‌చార్జ్ కిడారి శ్రవణ్ కుమార్ మాట్లాడుతూ అరాచపాలన జరుగుతుందని, స్కామ్‌లు ప్రభుత్వాన్ని తరిమి కొట్టాలన్నారు. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా జనసేన జిల్లా అధ్యక్షులు పి.చంద్రమోహన్, టిడిపి, జనసేన పార్టీల నాయకులు పడాల భూదేవీ, గర్భాన సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

ముఖ్య నాయకులు ఎందుకు రాలేదో?

శంఖారావం సభకు పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు కిమిడి కళావెంకటరావు, పార్టీ అధ్యక్షులు అచ్చెన్నాయుడు హాజరు కాకపోవడం పట్ల సర్వత్రా చర్చ జరిగింది. తొలి నుంచి పాలకొండ నియోకవర్గంలో ఒక గ్రూపు కళావెంకటరావు, మరో గ్రూపు అచ్చెన్నాయుడుతో ఉండడంతో గ్రూపుల పోరు సెగ వారికి తగలకుండా దూరంగా ఉన్నట్లు చర్చ జరుగుతోంది.

జెఇఇ మెయిన్స్‌లో ఉత్తరాంధ్ర టాపర్‌గా శ్రీనిధి

ప్రజాశక్తి -విజయనగరం

జెఇఇ మెయిన్స్ లో ఎన్‌టిఎ ర్యాంకింగ్‌లో ఉత్తరాంధ్రలో ధనుకొండ శ్రీనిధి టాపర్‌గా నిలిచింది. కొమరాడ మండలం లోని దళాయిపేటకు ధనుకొండ శ్రీనివాసరావు, సుశీల రెండో కుమార్తె శ్రీనిధి జెఇఇ మెయిన్స్ ఫలితాల్లో 300 మార్కులకు 290 స్కోర్ తో 99.99 పర్సంటేజీ సాధించి ఉత్తరాంధ్రలో టాపర్ గా నిలిచింది. భౌతిక, రసాయనశాస్త్రాల్లో వందకు వందమార్కులు, గణితంలో వందకు 99.99మార్కులు సాధించి టాప్‌లో నిలిచింది. శ్రీనిధి తల్లిదండ్రులు ఇద్దరూ ఉపాధ్యాయులే. శ్రీనిధి పదో తరగతి వరకు విజయనగరం శ్రీ చైతన్య పాఠశాలలో చదవగా, ప్రస్తుతం ఇంటర్మీడియట్ రెండో సంవత్సరం ఎంపిసి విజయవాడలోని శ్రీచైతన్య కాలేజీలో చదువుతుంది. శ్రీనిధికి మంచి ర్యాంకు రావడంపట్ల పలువురు అభినందనలు తెలిపారు.జిల్లాకు చెందిన పలువురు విద్యార్థులు 99శాతానికి పైగా పర్సంటేల్ సాధించారు.

గిరిజన విద్యార్థులు ప్రతిభ

సీతంపేట : స్థానిక ఐటిడిఎ ఆధ్వర్యంలో ఐఐటి సూపర్ 60కి శ్రీకాకుళం వైటిసిలో శిక్షణ పొందుతున్న విద్యార్థులు జెఇఇ మెయిన్స్‌లో ప్రతిభ కనబర్చారు. అత్యధిక స్కోరు సాధించిన వారిలో కొత్తూరు ఉపేంద్ర 88.98, గేదెల చైతన్య 87.14, ఆరిక ప్రశాంత్ 83.96, సవర స్రవంతి 78.07, బిడ్డిక ఫ్రాన్సిస్ 75.79, సవర అభి 71.50 ఉన్నారు. సూపర్ 60 ప్రారంభించిన ఐదు నెలల్లోనే అత్యుత్తమ ఫలితాలను సాధించడంపై ఐటిడిఎ పిఒ కల్పనా కుమారి విద్యార్థులకు, ప్రిన్సిపల్ బెండి మురళీబాబు, ఫ్యాకల్టీ సభ్యులైన బి.కిరణ్ కుమార్, కెవికె శ్రీకాంత్, వైవి వసంత కుమార్ బి.ప్రభాకర్ రావు వైటిసి కేర్‌టేకర్ కె. శ్రీనివాసరావు, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ ఎన్.రాంబాబుకు అభినందనలు తెలిపారు.

విజయనగరం తోటపాలెంలోని కలాం కళాశాలకు చెందిన జె.చైతన్య 98.72, రొంగలి లీలాపవన్ 96.86 పర్సంటేల్ సాధించారు. వీరిని కళాశాల డైరెక్టర్ ఎవిఎస్ నాయుడు అభినందించారు. పాల్‌నగర్‌కు చెందిన నమ్మి కౌశిక్ కల్యాణ్ జెఇఇ మెయిన్స్‌లో 98.97శాతం మార్కులు సాధించాడు.

కలెక్టరేట్ నిర్మాణానికి రూ.99.90 కోట్లు

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

జిల్లా కలెక్టర్ కార్యాలయ నిర్మాణానికి రూ.99.90 కోట్లతో మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు జిఒఆర్‌టి 65 ఉత్తర్వులను ఈ నెల 8న విడుదల చేసింది. సమీకృత జిల్లా కలెక్టర్ కార్యాలయ సముదాయాన్ని (ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ కాంప్లెక్స్) అడ్డాపుశిలలో నిర్మించేందుకు నిధులను మంజూరు చేసింది. రాష్ట్రంలో 13 జిల్లాల్లో సమీకృత జిల్లా కలెక్టర్ కార్యాలయ సముదాయాలు నిర్మించాలని ప్రభుత్వ నిర్ణయంలో భాగంగా రహదారులు, భవనాలు శాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్ సమర్పించిన సవివరమైన నివేదిక మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కొత్త జిల్లాల్లో సమీకృత జిల్లా కలెక్టర్ కార్యాలయ సముదాయం నిర్మించాలని, అందులో భాగంగా పార్వతీపురం మన్యం జిల్లాలో మొదటి విడతలో నిర్మాణానికి ప్రతిపాదించి శ్రీకారం చుట్టడం హర్షించదగ్గ పరిణామం.

ఉత్తర్వులు జారీ కావడం సంతోషం

సమీకృత జిల్లా కలెక్టర్ కార్యాలయ సముదాయం నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం సంతోషంగా ఉందని కలెక్టర్ నిశాంత్ కుమార్ అన్నారు. అడ్డాపుశిల వద్ద భూమిని ఎంపిక చేశామని, 59.80 ఎకరాల భూమిని కేటాయించామని చెప్పారు. భవన నిర్మాణ పనులు త్వరగా ప్రారంభమై, వేగవంతంగా పూర్తి కావాలని ఆకాంక్షిస్తున్నట్లు ఆయన తెలిపారు. తదుపరి ప్రక్రియ వేగవంతం కాగలదని ఆయన అన్నారు.

అరబిందో భూములను జెసి పరిశీలన

ప్రజాశక్తి - భోగాపురం

సిబ్బందితో మాట్లాడుతున్న జెసి కార్తీక్

కోట భోగాపురం రెవెన్యూ పరిధిలోని అరబిందో కంపెనీకి సంబంధించిన భూములను జిల్లా జాయింట్ కలెక్టర్ కె. కార్తీక్ మంగళవారం పరిశీలించారు. జగన్ అక్రమాస్తుల కేసులో అరబిందో కంపెనీ కొనుగోలు చేసిన 75 ఎకరాలను గతంలో ఈడి సీజ్ చేసింది. ఆ తర్వాత ఈ భూములను నిషేధిత జాబితా నుంచి ఈడీ తొలగించింది. జాబితాలోలేని కొన్ని సర్వే నెంబర్లు ఇంకా నిషిద్ధ జాబితాలో ఉండడంతో తొలగించాలని స్థానిక రెవెన్యూ అధికారులు జిల్లా ఉన్నతాధికారులు దృష్టికి తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో జాయింట్ కలెక్టర్ ఈ భూములను పరిశీలించినట్లు తెలుస్తోంది. అరబిందో కంపెనీ ఈ భూముల్లో కంపెనీ కూడా పెడుతుందని గతంలో ప్రచారం కూడా జరిగింది. ఉప తహశీల్దారు శ్రీనివాసరావును ఈ భూ సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. మండల సర్వేయర్ ముదికేశ్వరరావు, సచివాలయం సర్వేయర్ సురేష్, విఆర్‌ఒ ఉషారాణి తదితరులు జెసి వెంట ఉన్నారు.

ఉద్యమ కార్యాచరణను విజయవంతం చేద్దాం

ప్రజాశక్తి - బొబ్బిలి

ఉద్యోగ, ఉపాధ్యాయ, పింఛనుదార్ల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర జెఎసి నాయకత్వం గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్ తో జరిపిన చర్చలు పురోగతి లేని నేపథ్యంలో జెఎసి ప్రకటించిన ఉద్యమ కార్యాచరణ జయప్రదం చేద్దామని తాలూకా చైర్మన్ సూర్యనారాయణ తెలిపారు. మంగళ వారం స్థానిక ఎన్‌జిఒ హోంలో తాలూకా స్థాయి జెఎసి సమావేశాన్ని కార్యదర్శి రామారావు అధ్యక్షతన నిర్వహించారు. సమస్యల పరిష్కారానికి చేపట్టే ఆందోళనల్లో పెద్దఎత్తున పాల్గొనాలని కోరారు. 14 న తహశీల్దార్లకు వినతులు, 15,16న భోజన విరామ సమయంలో నిరసనలు, 17న ర్యాలీ నిర్వహించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు జె సి రాజు, విజయగౌరి ధనుంజయ రావు, ఎన్‌జిఒ నాయకులు రామా రావు,వెంకట నాయుడు, చుక్క శ్రీను ,సత్యరావు, వెంకట రావు,అమర్నాథ్ పాల్గొన్నారు

16న జాబ్‌మేళా

ప్రజాశక్తి-విజయనగరం కోట

నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి కల్పించేందుకు 9 ప్రైవేటు కంపెనీలలో 1750 పోస్టులకోసం ఎస్‌పి బంగ్లా పక్కన గల శ్రీ చైతన్య కళాశాలలో ఈనెల 16న ఉదయం 10 గంటలకు ఆన్‌లైన్ జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్ప అధికారి డి. అరుణ ఒక ప్రకటన లో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు మొదట www.ncs.gov.in website లో జాబు సీకర్ లాగిన్ లో నమోదు చేసుకొని తమ బయో డేటా , రెండు పాస్ ఫోటోలతో శ్రీ చైతన్య డిగ్రీ కాలేజీలో ఈ నెల 16 న నిర్వహించే జాబ్ మేళా కు హాజరు కావాలని తెలిపారు.

రేపు టెలికం వినియోగదారుల అవగాహన సదస్సు

ప్రజాశక్తి-విజయనగరం

బిఎస్‌ఎన్‌ఎల్ సేవలపై ఈనెల 15న సంచారభవనం కాన్ఫరెన్సు హాలులో సదస్సు నిర్వహించనున్నట్లు శ్రీకాకుళం బిజినెస్ ఏరియా ప్రిన్సిపాల్ జనరల్ మేనేజర్ గొల్లమూడి ఆడమ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సులో వినియోగదారులంతా http://meet.google.com/rqv-xtfz-ikv లింకు ద్వారా పాల్గొని తమ సమస్యలను, సలహాలను తెలియజేయవచ్చునని తెలిపారు.

ఉద్యోగుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఉద్యోగ,ఉపాధ్యాయుల పెండింగ్ సమస్యలు తక్షణం పరిష్కరించాలని ఎస్‌టియు జిల్లా అధ్యక్షులు కె.జోగారావు డిమాండ్ చేశారు. అమర్‌భవన్‌లో మంగళవారం జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో జోగారావు మాట్లాడారు. సిపిఎస్‌ను రద్దు చేసి ఒపిఎస్‌ను పునరుద్దరించాలని, పెండింగులో ఉన్న పిఆర్‌సి బకాయిలు, డిఎ బకాయిలు, జిపిఎఫ్ మెడికల్ రీయంబర్స్ మెంట్ తదితర బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రదాన కార్యదర్శి చిప్పాడ సూరిబాబు మాట్లాడుతూ అప్రెంటిస్ అమలు చేయడాన్ని విరమించు కోవాలన్నారు. 117 జీవోను రద్దు చేయాలని కోరారు.కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిలర్ గోవిందరావు, జిల్లా ఉపాధ్యక్షులు ఎంఎ స్వామి, జిల్లా అదనపు ప్రధాన కారదర్శి. పి. రాంబాబు, జిల్లా కార్యదర్శి పి.రమణ, డి.శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

అమృత్ భారత్ అభివృద్ధి పనులు పరిశీలన

ప్రజాశక్తి - కొత్తవలస

రైల్వే సిబ్బందితో మాట్లాడుతున్న డిఆర్‌ఎం సౌరబ్ ప్రసాద్

రైల్వే స్టేషన్ల అభివృద్ధిలో భాగంగా కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన అమృత్ భారత్‌లో కొత్తవలస రైల్వేస్టేషన్‌లో నిర్వహిస్తున్న వివిధ అభివృద్ధి పనులను విశాఖ డిఆర్‌ఎం సౌరబ్ ప్రసాద్ మంగళ వారం ఆకస్మికంగా పరిశీలించారు. రూ.22 కోట్లతో చేపట్టిన ఈ పనులు నాణ్యత ప్రమాణంగా ఉండాలని, సకాలంలో పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. స్టేషన్ అభివృద్ధి, ఫ్లాట్‌ఫారమ్‌లో ప్రయాణికులకు వివిధ రకాల సౌకర్యాలను కల్పించే విధంగా పనులుండాలన్నారు. కొత్తవలస రైల్వే స్టేషన్‌కు రెండవ ముఖద్వారం ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. ఈ స్టేషన్‌లో రాయగడ ఎక్స్‌ప్రెస్ రైలతోపాటు అవసరమైన పలు రైళ్లను నిలుపుదల చేసే ప్రక్రియ ఉన్నతాధికారుల దృష్టిలో ఉందని ఆయన ఈ సందర్భంగా వెల్లడించారు. ఈ పనులు నెలాఖరు లోగా పూర్తిచేసి వచ్చే నెలలో ప్రారంభించేలా చర్యలు చేపడుతున్నామన్నారు. ఆయన వెంట స్టేషన్ మేనేజర్ రాజు తదితరులు ఉన్నారు.

అక్రమ రవాణాపై నిఘా పెట్టండి

ప్రజాశక్తి-బొబ్బిలి

రైళ్లలో అక్రమ రవాణాపై నిఘా పెట్టాలని రైల్వే సబ్ డివిజనల్ పోలీస్ అధికారి బి.మోహనరావు ఆదేశించారు. వార్షిక తనిఖీలలో భాగంగా బొబ్బిలి ఔట్ పోస్టును ఆయన మంగళవారం సందర్శించి తనిఖీ చేశారు. ఎన్నికల నేపథ్యంలో తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. రైళ్లలో అక్రమ మద్యం, మాదకద్రవ్యాలు నివారణకు పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. రైళ్లను ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలన్నారు. ఆయనతో రైల్వే లైన్స్ సిఐ కె.వెంకటరావు, రైల్వే ఎస్ఐ వి.రవివర్మ ఉన్నారు.

టిడిపితో యువతకు బంగారు భవిష్యత్తు

ప్రజాశక్తి-విజయనగరం కోట

మాట్లాడుతున్న టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి అదితి గజపతి

చంద్ర బాబు అధికారం లోకి వస్తే యువతకు బంగారు భవిష్యత్తు ఉంటుందని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పి.అదితి గజపతి అన్నారు. యువతకు ఉద్యోగాలు లేకపోతే వారి భవిష్యత్తు నాశనమై డిప్రెషన్ లోకి వెళ్లిపోయే ప్రమాదం ఉందని ఆవేదన చెందారు. మంగళవారం అశోక్ బంగ్లా టిడిపి కార్యాలయంలో 'ఫస్ట్‌ఓటు ఫర్ సిబిఎన్' పేరిట నిరుద్యోగ యువతతో కార్యక్రమం ఏర్పాటు చేశారు. ముందుగా యువత మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రాష్ట్రంలో ఐటి సెక్టార్ ఎక్కువగా తీసుకువచ్చి వేల సంఖ్యలో ఉద్యోగాలను కల్పించారని తెలిపారు. మన రాష్ట్రానికి ఇతర రాష్ట్రాల నుంచి ఉద్యోగాలకు వచ్చే పరిస్థితి నుండి మన రాష్ట్రం నుండి ఇతర రాష్ట్రాలకు యువత ఉద్యోగాలకు వెళ్లే పరిస్థితి వచ్చిందన్నారు. జగన్మోహన్ రెడ్డి వచ్చాక సచివాలయ ఉద్యోగాలు తప్ప మరి ఏ ఇతర ఉద్యోగాలు తీయలేదన్నారు. మళ్లీ చంద్రబాబు ముఖ్యమంత్రి అయితే యువత భవిష్యత్తు ఉద్యోగాల వైపు వెళుతుందని అన్నారు. అదితి గజపతిరాజు మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత రాష్ట్రం నుండి పరిశ్రమలు వెళ్లిపోయాయని, ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాలు సైతం లేవని తెలిపారు. ఏటా జాబ్‌కేలండర్ ప్రకటిస్తామని చెప్పి యువతకు వెన్నుపోటు పొడిచారన్నారు. చంద్రబాబు సిఎం అయితే రాష్ట్ర రూపు రేఖలు మారుస్తారని, యువతకు బంగారు భవిష్యత్తును అందిస్తారని అన్నారు.

అశోక్ ను కలిసిన రాంప్రసాద్

రాష్ట్ర బ్రాహ్మణా సాధికార కమిటీ కన్వీనర్ బుచ్చి రాంప్రసాద్ మంగళవారం నాడు పార్టీ కార్యాలయం అశోక్ బంగ్లాలో పొలిట్ బ్యూరో సభ్యులు పూసపాటి అశోక్ గజపతి రాజును, నియోజకవర్గ ఇంచార్జ్ పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతి రాజును మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనతో పాటు పార్లమెంట్ బ్రాహ్మణ సాధికార కమిటీ కన్వీనర్ రాకేష్ శర్మ, ఇతర బ్రాహ్మణ కమిటీ నాయకులు పాల్గొన్నారు.

సంఘీభావం తెలిపిన అదితి

ఉత్తరాంధ్ర తెలగాలను బిసిలో చేర్చాలని పాదయాత్ర చేస్తున్న తెలగ సంఘం నాయకులు పివిఆర్ ను మంగళవారం అదితి గజపతి కలిసి సంఘీభావం తెలిపారు.

బిఎస్‌ఎన్‌ఎల్ ఉద్యోగుల ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మూడో వేతన సవరణ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బిఎస్‌ఎన్‌ఎల్ కార్యాలయం వద్ద ఆ సంస్థ ఉద్యోగులు మంగళవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఎన్ ఎఫ్‌టిఇ అధ్యక్ష ,కార్యదర్శులు జి.భాస్కరరావు,ఎన్.అప్పారావు మాట్లాడుతూ 2017 జనవరి 1 నుంచి మూడవ వేతన సవరణ అమలు చేయాలని, నూతన ప్రమోషన్ పాలసీని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అన్ని కేడర్లలో ఏర్పడిన వేతన స్టాగ్నేషన్‌ను తొలగించే చర్యలు తీసుకోవాలన్నారు.

ఎమ్మెల్యే టికెట్ యాదవులకు ఇవ్వాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లాలో ఎమ్మెల్యే, ఎంపిపి, జెడ్‌పిటిసి పదవుల్లో యాదవులకు సీట్లు కేటాయించాలని, విజయనగరం అసెంబ్లీ టికెట్ యాదవులకు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ మంగళవారం యాదవ సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో వైసిపి జిల్లా అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు ఇంటి వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం జిల్లా అధ్యక్షులు లేకపోవడంతో కుటుంబ సభ్యులకు వినతి పత్రం అందజేశారు.కార్యక్రమాన్ని ఉద్దేశించి యాదవ సంఘాల ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు సాయి కిరణ్ యాదవ్ మాట్లాడుతూ జిల్లాలో రెండున్నర లక్షలు ఓటర్లు ఉన్న యాదవులకు రాజకీయ పదవుల్లో తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. విజయనగరం నియోజకవర్గంలో 45వేల మంది ఓటర్లు యాధవులు ఉన్నారన్నారు. విజయనగరం ఎమ్మెల్యే టికెట్ యాదవులకు కేటాయించాలని డిమాండ్ చేశారు. మా తాలూకా ఆవేదనని ముఖ్యమంత్రి దష్టికి తీసుకెళ్లాలని కోరారు. కార్యక్రమంలో వేదిక

వైసిపికి పిళ్లా, అవనాపు రాజీనామా

- టిడిపిలో చేరేందుకు రంగం సిద్ధం
- ఎమ్మెల్యే పీడను వదిలించడమే ధ్యేయం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రాజీనామా పత్రాలను చూపుతున్న విజయ్, విజయ్‌కుమార్,అప్పారావు

వైసిపి సీనియర్ నాయకులు పిల్లావిజయకుమార్, యువజన విభాగం నాయకులు అవనాపు.విజయ్, మాజీ కౌన్సిలర్ గాడు అప్పారావు ఆ పార్టీకి రాజీనామా చేవారు. మంగళవారం అవనాపు విజయ్ నివాసం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈమేరకు రాజీనామా లేఖను విడుదల చేశారు. అనంతరం అవనాపు విజయ్ మాట్లాడుతూ 2009లో మొదటి సారి జగన్ కి చేదోడు వాదోడుగా ఉన్నామన్నారు. వైఎస్ మరణం తర్వాత ఒదార్పు యాత్రకు అన్ని విధాలా అండగా ఉన్నామన్నారు. ఆనాడు బొత్స సత్యనరాయణను, అశోక్‌గజపతిని ఎదుర్కొని నిలబడ్డామన్నారు. జగన్ సిఎం అవ్వడం ముఖ్యమని కోలగట్ల గెలుపుకోసం పని చేశామన్నారు. ఆస్తులు పోగొట్టుకొని, అనేక సేవలు వైసిపికి అందించామన్నారు. కానీ పార్టీలో తమకు ఎటువంటి ప్రాధాన్యతా ఇవ్వకుండా అవమానపరిచారని చెప్పారు. వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత పార్టీ కోసం పని చేసిన తమ భవిష్యత్ రాజకీయాలకు అన్యాయం చేయడం తగదన్నారు. ఈ విషయం విజయసాయి రెడికి, వైవి సుబ్బారెడ్డికి, జిల్లా నాయకులు బొత్స సత్యనారాయణకు, మజ్జి శ్రీనివాసరావుకు చెప్పినా పట్టించుకోలేదన్నారు. అందుకే రాజీనామా చేసి టిడిపిలో చేరడానికి సిద్ధమైనట్లు తెలిపారు.

పిల్లా విజయకుమార్ మాట్లాడుతూ పదవులతో రాజకీయం చేయాలనే ఆలోచనతో ఎమ్మెల్యే కోలగట్ల పని చేశారన్నారు. 2014 ఎన్నికల్లో ఎమ్మెల్యే కోలగట్ల ఓడిపోవడంతో ఆయన అక్కడినుంచి పార్టీ జిల్లా బాధ్యతలు చేపట్టి అవనాపు కుటుంబ సభ్యులను తొక్కే పెట్టే ప్రయత్నం చేశారన్నారు. ఆనాడు కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో ఏదో ఒక పార్టీలోకి వెళ్లాలని మంత్రి బొత్స చెప్పడంతో ఆయనతో పాటు వైసిపిలో చేరామన్నారు. పార్టీలో గ్రూపులు పెట్టీ ముక్కలు చేసే ప్రయత్నం చేయడం కోలగట్ల ద్వారా జరిగిందన్నారు. నేడు కాలనీల్లో ఏపని కావాలన్నా ఎమ్మెల్యే తప్ప కార్పొరేటర్ల ద్వారా ఏ పనీ కావడం లేదన్నారు. డిప్యూటీ మేయర్ ఎస్సీలకు ఇవ్వాలని కోరితే ఇవ్వకుండా ఆయన కుమార్తెకు ఇచ్చారన్నారు. ఎమ్మెల్యే బాధను బరించలేక పరువు కోసం చాలామంది కార్పొరేటర్లు పార్టీ నుంచి బయటకు వచ్చేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. జిల్లా కేంద్రంలో ఉన్న జ్యూట్ పరిశ్రమలను మూసి వేయించి ఎమ్మెల్యే కోలగట్ల రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారని తెలిపారు. మాన్సాస్ వ్యవహారంలో ఆందగజపతి రాజు కుమార్తెను దించి తగువులు పెట్టించారన్నారు. విజయనగరం పట్టణానికి పట్టిన ఎమ్మెల్యే పీడను వదిలించుకోవడానికి రాజీనామాలు చేసినట్లు తెలిపారు. సమావేశంలో మాజీ కౌన్సిలర్ గాడు అప్పారావు అనుచరులు ఉన్నారు. అనంతరం రాజాం వెళ్లి టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు కళా వెంకటరావును కలిశారు. సాయంత్రం పిళ్లా విజయకుమార్ ఇంటికి జనసేన నాయకులు లోకం మాధవి, పడాల అరుణ వెళ్లి తమ పార్టీలో చేరాలని ఆహ్వానించారు.

శ్రీను మహంతికి ఐకానిక్ అవార్డు

ప్రజాశక్తి - పూసపాటిరేగ

ఐ ఐ ఎ ఫ్ ఎ న్ ఈ అధినేత శ్రీను మహంతికి ఆసియన్ ఐకానిక్ అవార్డ్‌ను ప్రముఖ బాలీవుడ్ నటుడు, సామాజిక వేత్త సోనూసూద్ చేతుల మీదుగా ఆదివారం ముంబాయిలో ముక్త కల్చరల్ క్లబ్‌లో అందజేశారు. ఈ సందర్భంగా అవార్డ్ గ్రహీత మాట్లాడుతూ ప్రతిష్టాత్మక సంస్థ అందించే ఆసియన్ ఐకానిక్ అవార్డుకు అర్హత సాధించి అవార్డు స్వీకరించడం సంతోషంగా ఉందన్నారు. యువ పారిశ్రామిక వేత్తగా గుర్తింపు పొందిన తనకు సిఇఒగా వ్యవహరిస్తున్న ఫైర్ అండ్ సేఫ్టీ సంస్థ తరుపున అందిస్తున్న సేవలు దృష్ట్యా ప్రతిష్టాత్మక పురస్కారాన్ని అందజేస్తున్నట్లు సంబంధిత సంస్థ వెల్లడించిందన్నారు. శ్రీను మహంతి గతంలో కూడా పలు అవార్డులను అందుకున్న సంగతి తెలిసిందే. ఇంతటి అరుదైన పురస్కారానికి ఎంపికైన సందర్భంగా పలువురు పెద్ద ఎత్తున శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు.

సోనుసూద్ నుంచి అవార్డు అందుకుంటున్న శ్రీను

తాగునీటి నాణ్యతపై పరీక్షలు

బొబ్బిలి: మున్సిపాలిటీలో తాగునీటి నాణ్యతపై డిఇ కనకరాజు మంగళవారం పరీక్షలు నిర్వహించారు. కుళాయిలు ద్వారా వస్తున్న తాగునీటిని పరీక్షించి నాణ్యత ప్రమాణాలను పరిశీలించారు. మున్సిపల్ ప్రజలకు సురక్షితమైన తాగునీరు సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. తాగునీరు వృధా చేయకుండా పొదుపుగా వాడాలని కోరారు. వేసవిలో నీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

అవార్డు అందుకుంటున్న చింతా శారద

చింతా శారదకు ఉత్తమ సేవా పురస్కారం

బొబ్బిలి: ఉత్తమ సేవా పురస్కారానికి అభ్యుదయ విద్యా సంస్థలు ప్రిన్సిపాల్ చింతా శారద ఎంపికయ్యారు. ప్రపంచ మానవహక్కుల కౌన్సిల్ సదస్సును మంగళశారం రైల్వే కోడూరులో నిర్వహించారు. చింతా శారద చేసిన సేవలను గుర్తించి జాతీయ అద్యక్షులు డాక్టర్ ఎంఆర్ ఆన్సరి, జాతీయ ఉపాధ్యక్షులు ఎం.అన్వర్, ఎపి రాష్ట్ర అధ్యక్షులు షేక్ మస్తాన్ సాహెబ్, సౌత్ ఇండియా అధ్యక్షులు షేక్ షాజహాన్ ఉత్తమ సేవా పురస్కారాన్ని ఆమెకు అందజేశారు. జాతీయ కోర్ కమిటీలో శారదకు స్థానం కల్పించారు. ఉత్తమ సేవ పురస్కారం మరింత బాధ్యతలు పెంచిందని చింతా శారద అన్నారు. శారదను పలువురు అభినందించారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి

బొబ్బిలి: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి కోరారు. ఇందిరమ్మ కాలనీలో మంగళవారం పారిశుధ్య పనులను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రోడ్లు, కాలువలలో చెత్త వేయకుండా పారిశుధ్య కార్మికులకు అందించాలన్నారు. రోడ్డు, కాలువలలో చెత్త వేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. కార్మికులు ఇంటింటికి వెళ్లి చెత్త సేకరించాలని ఆదేశించారు.

విగ్రహావిష్కరణలో గ్రూపు రాజకీయం

గుర్ల: మండలంలోని పాలవలసలో సోమవారం రాత్రి ఎన్‌టిఆర్ విగ్రహాన్ని టిడిపి నియోజకవర్గం ఇంఛార్జి కిమిడి నాగార్జున ఆవిష్కరించారు. ఈయనతో పాటు రాష్ట్ర బిసి సెల్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ వెన్నె సన్యాసినాయుడు, టిడిపి మండల అధ్యక్షులు చనమల్ల మహేశ్వర రావు, పార్టీ నాయకులు తిరుములరాజు కిరణ్ కుమార్, పిల్ల అప్పల నాయుడులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో గ్రామంలో ఉన్న టిడిపికి చెందిన తాడ్డి శ్రీనివాసరావు, గేదెల అప్పలనాయుడుల రెండు గ్రూప్‌లు మధ్య ఘర్షణలు చెలరేగడంతో సమావేశం రసభాషగా మారింది. మండల నాయకులు జోక్యం చేసుకొని ఇరు వర్గాలకు సర్దిచెప్పారు. అనంతరం నాగార్జున మాట్లాడుతూ గ్రామంలో కార్యకర్తలు మధ్య మనస్పర్థలు ఉంటే అందరం సమావేశం ఏర్పాటు చేసుకొని సమస్యలు పరిష్కరించుకొందామన్నారు. ఒక్క అవకాశం ఇస్తే ఈ ప్రాంతం అభివృద్ధికి కృషి చేస్తానని ఆయన అన్నారు. సమావేశం మధ్యలో ఇరు వర్గాలు మధ్య ఘర్షణలు చెలరేగాయి. దీంతో పోలీసులు ఇరువర్గాలను చెదరగొట్టారు. సమావేశం ముగిసిన తర్వాత గ్రామంలో ఇరువర్గాలు మధ్య మరల ఘర్షణ వాతావరణం నెలకొని రాళ్ళు రువ్వు కోవడంతో ఒక వర్గానికి చెందిన కారు అద్దాలు ధ్వంసమయ్యాయి. దీంతో తాడ్డి శ్రీనివాసరావు పోలీసులు కు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ ఐ భాస్కర్ రావు తెలిపారు.

పౌష్టికాహారం అందడంలేదని ఆరోపణలు

వేపాడ: మండలంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు, గర్భిణులకు, బాలింతలకు పౌష్టికాహారం అందడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. దీనిపై సూపర్‌వైజర్ కామేశ్వరిని వివరణ కోరగా గుడ్లు మాత్రం సరిపడా అందిస్తున్నామని పౌష్టికాహారం కొంత తక్కువగా వస్తుందని చెప్పారు. ప్రభుత్వం ఎప్పుడు పంపిస్తే అప్పుడే పూర్తిస్థాయి పౌష్టికాహారం పంపిణీ చేయడానికి సిద్ధంగా ఉన్నామని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ సూపర్వైజర్ కామేశ్వరి తెలిపారు.



టెస్టు పేపర్లను పంపిణీ చేస్తున్న యుటిఎఫ్ నాయకులు, తదితరులు

ఉచితంగా మోడల్ టెస్టు పేపర్లు పంపిణీ

బొబ్బిలిరూరల్: మండలంలోని మెట్టవలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదోతరగతి విద్యార్థులకు యుటిఎఫ్ ముద్రించిన మోడల్ టెస్టు పేపర్లను ఆ గ్రామం రిటైర్డ్ బ్యాంకు మేనేజర్, స్పందన సంస్థ ప్రతినిధి కాజా గోపాలరావు సౌజన్యంతో 50 మంది విద్యార్థులకు మంగళవారం ఉచితంగా పంపిణీ చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయిని విశాలాక్షి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆ గ్రామ సర్పంచ్ మాధవరావు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం యుటిఎఫ్ విద్యార్థుల కోసం చేస్తున్న గొప్ప కృషికి ధన్యవాదాలు తెలిపారు. యుటిఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు విజయగౌరి, జిల్లా సహాధ్యక్షులు ప్రసన్నకుమార్, జిల్లా కార్యవర్గ సభ్యులు శశిభూషణరావు, బత్తుల శ్రీనివాస్, గ్రీన్‌బెల్ట్ సొసైటీ ప్రతినిధులు రమణమూర్తి, కృష్ణ దాసు, గ్రామ పెద్దలు శంకరరావు పాల్గొని విద్యార్థుల కోసం నిరంతరం కృషి చేస్తూ లక్షలాది పుస్తకాలను ముద్రించి విద్యార్థులకు అందచేయడం అభినందనీయమని కొనియాడారు. పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

120 మద్యం సీసాల పట్టివేత

ప్రజాశక్తి - లక్కవరపుకోట

మండలంలోని రేఖ గ్రామపంచాయతీలో అక్రమంగా తరలిస్తున్న 120 మద్యం సీసాలను పట్టుకుని సీజ్ చేసినట్లు స్థానిక ఎస్ఐ ఆర్ గోపాలరావు మంగళవారం తెలిపారు. తమకు ముందస్తుగా వచ్చిన సమాచారం మేరకు కాపు కాసి పట్టుకున్నట్లు వెల్లడించారు. వీటి విలువ సుమారు రూ. 18 వేలు ఉంటుందని అంచనా వేశారు. ఈ తరహా నేరానికి పాల్పడిన రేగ గ్రామ నివాసి ఎన్ నారాయణను అరెస్టు చేసి కోర్టుకు తరలించినట్లు వెల్లడించారు. ఈ దాడులలో హెడ్ కానిస్టేబుల్ పాపారావు, కానిస్టేబుళ్లు పోతురాజు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రెండు వాహనాలు సీజ్

ప్రజాశక్తి - కొత్తవలస

అక్రమంగా పశువులను తరలిస్తున్న రెండు వ్యాన్‌లను కొత్తవలస పోలీసులు పట్టుకున్నారు. మండలంలోని చింతల దిమ్మ వద్ద సిఐ చంద్రశేఖర్, సిబ్బంది వాహనాలను మంగళవారం తనిఖీ చేయగా ఎటువంటి అనుమతులు లేకుండా పశువులను అక్రమంగా తరలిస్తున్న రెండు వాహనాలను పట్టుకొని సీజ్ చేసినట్లు తెలిపారు. రెండు వాహనంలో కలిపి 23 పశువులను అక్రమంగా తరలిస్తున్నారని దీనిపై రెండు కేసులు నమోదు చేస్తున్నామని చెప్పారు.

ఐవిఆర్ఎస్ @ ఆ నలుగురు

- అభ్యర్థి ఎంపికపై టిడిపి ఆరా
- గజపతినగరంలో ఆసక్తికర రాజకీయం

కెఎ నాయుడు

తెంటు లక్ష్మునాయుడు

కె.శ్రీనివాసరావు

కె.శివరామకృష్ణ

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

గజపతినగరం అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి ఎంపికపై టిడిపి అధిష్టానం మల్లగుల్లాలు పడుతోంది. ఇందుకోసం ఐవిఆర్ఎస్ (ఇంట్రాక్టివ్ వాయిస్ రెస్పాన్స్ సిస్టమ్) ద్వారా నలుగురు ఆశావహులపై ప్రజల నుంచి అభిప్రాయాలను తీసుకుంటోంది. ఇదంతా ప్రజాదరణ ఉన్న నేతకు సీటు ఇచ్చేందుకేనా? లేక బహు నాయకత్వం నేపథ్యంలో గ్రూపులపోరును చల్లార్చి, పార్టీ అనుకున్న అభ్యర్థికి టిక్కెట్ కట్టబెట్టేందుకా? అన్న సందేహాలు వ్యక్తమౌతున్నాయి. స్థానిక మాజీ ఎమ్మెల్యే కొండపల్లి అప్పలనాయుడు టిక్కెట్ కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. మరోవైపు ఆయన సోదరుడు కొండపల్లి కొండలరావు తన కుమారుడు శ్రీనివాసరావు కోసం కొద్దిరోజులుగా ప్రయత్నాలు ముమ్మరం చేశారు. బొబ్బిలి రాజుల సిఫార్సులతో తెర్లాం మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మునాయుడు, విజయనగరం రాజుల సిఫార్సులతో టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి కరణం శివరామకృష్ణ కూడా ప్రయత్నాలు చేస్తున్నారు. ఓవైపు పార్టీ సీనియర్ నేత, మాజీ ఎంపీ కొండపల్లి పైడితల్లి నాయుడు కుటుంబం, మరోవైపు జిల్లా టిడిపిలో బొబ్బిలి, విజయనగరం రాజులు కీలకంగా ఉన్నారు. పైడితల్లి నాయుడు కురుమారులిద్దరూ చాలాకాలంగా రాజకీయవైఖరిలో ఉత్తర దక్షిణ ధ్రువాల్లా ఉంటున్నారు. ఈ నేపథ్యంలో గజపతినగరం టిడిపి నియోజకవర్గం నుంచి ఎవరిని పోటీలో దింపాలన్న దానిపై అధిష్టానానికి తలనొప్పిగా మారింది. ప్రస్తుత పరిస్థితుల్లో టిడిపి ప్రతిస్థానాన్ని కీలకంగానే భావిస్తోంది. మరోవైపు వైసిపికి చెందిన స్థానిక సిట్టింగ్ ఎమ్మెల్యే రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా బలమైనవారు. టిక్కెట్ కూడా ఆ పార్టీ నుంచి దాదాపు ఖరారైనట్టే. ఇటువంటి పరిస్థితుల్లో అందుకు ధీటైన అభ్యర్థిని నిలబెట్టాలని టిడిపి అధిష్టానం తొలి నుంచీ భావిస్తోంది. కానీ, నియోజకవర్గంలో పరిస్థితులు అందుకు అనుకూలంగా లేవు. స్థానిక మాజీ ఎమ్మెల్యే కొండపల్లి అప్పలనాయుడు, కరణం శివరామకృష్ణ చాలా కాలంగా నియోజకవర్గంలో వేరువేరు గ్రూపులు నడుపుతున్నారు. అప్పలనాయుడు ఆశిస్తుండగానే అతని సోదరుడు తన కుమారుడి కోసం ప్రయత్నం చేస్తున్నారు. వీరి మధ్య రాజకీయంగా కూడా పొసగడం లేదు. ఇటువంటి పరిస్థితుల్లో నిజంగా ఈ నలుగురిలో ఎవరో ఒకరికోసమే ఐవిఆర్ఎస్ సర్వే జరుగుతోందా? లేక కొత్త అభ్యర్థిని తెరమీదకు తేవడం లేదా తప్పనిసరి పరిస్థితి అయితే పొత్తులో భాగంగా జనసేన అభ్యర్థికి కేటాయిస్తారా? అంటూ నియోజకవర్గంలో ఆసక్తికరమైన చర్చనడుస్తోంది.

టిడిపిలో గ్రూపుల పోరు?

సభకు తరలింపుపై కార్యకర్తల్లో మథనం

ప్రజాశక్తి- వేపాడ

మండలంలోని టిడిపిలో గ్రూపుల పోరు కార్యకర్తలను, కేడర్‌ను సతమతం చేస్తుంది. టిడిపి నియోజకవర్గ ఇంచార్జి కోళ్ల లలితకుమారి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి గొంప కృష్ణలు రెండు వర్గాలను తయారు చేయడంతో మండలంలోని నాయకులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ నెల 17న సోంపురం జంక్షన్‌లో లోకేష్ శంకారావం సభను ఏర్పాటు చేశారు. దీనికి మండలం నుంచి పెద్ద ఎత్తున కార్యకర్తలను, నాయకులను తరలించాలని అధి నాయకత్వం పిలుపునిచ్చింది. దీంతో గొంప కృష్ణ ఒకవైపు, లలితకుమారి మరోవైపు కార్యకర్తల తరలింపుపై సన్నాహాలు చేస్తున్నారు. అయితే రెండు గ్రూపులుగా విడిపోవడాన్ని కొంత మంది కార్యకర్తలు జీర్ణించ కోలేకపోతున్నారు. పైగా ఏ గ్రూపుతో వెళితే ఏం జరుగుతుందోనని భయపడుతున్నారు. ఒక వేళ టికెట్ రాని వారి గ్రూపుతో తిరిగితే గెలిచిన అభ్యర్థి తరువాత తమను ఇబ్బందులకు గురిచేస్తారేంటోనని మధనపడు తున్నారు. కాగా ఇద్దరు నాయకులు తనకు టిక్కెట్ ఇస్తారంటే తనకుఉ ఇస్తారని ప్రచారం చేసుకుం టున్నారు. దీంతో ఎవరి పక్షాన సభకు వెళితే ఏమవుతుందోనని కార్యకర్తలు సందేహం వ్యక్తం చేస్తున్నారు. దీంతో చాలా మంది సభకు రావడానికి కూడా నిరాకరిస్తున్నట్లు సమాచారం. ఇప్పటికైనా అధిష్టానం దృష్టి సారించి టిడిపి ఎమ్మెల్యే టిక్కెట్టు ఎవరికి ఇస్తారో తేల్చితే బాగుంటుందని లేదంటే పార్టీకే నష్టం జరిగే ప్రమాదం ఉందని పలువురు చర్చించుకుంటున్నారు.

టిడిపి విజయం తథ్యం :చింతల

ప్రజాశక్తి - రామభద్రపురం

రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి విజయం తథ్యమని ఆ పార్టీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి చింతల రామకృష్ణ అన్నారు. మంగళవారం మేజర్ పంచాయతీ రామభద్రపురంలో భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమంపై ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ప్రతీ గడపకు వెళ్లి తెదేపా ఎన్నికల మేనిఫెస్టో వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ తెదేపా ఇంచార్జ్ బేబీనాయన ఆధ్వర్యంలో కార్యకర్తలు, నాయకులు పార్టీ కోసం శ్రమించి అలుపెరగని సైనికుల వలే పార్టీ విజయం కోసం కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రవ్వ ఈశ్వరరావు, నాయకులు వెంకటి, నాగేశ్వరరావు,పెద్దపల్లి సూరి తదితరులు పాల్గొన్నారు.

అనుమతులిస్తే ఆందోళన తప్పదు

- గతంలో ఇచ్చిన ఇసుక ర్యాంపుతో ఇబ్బందులు
- కొత్తగా అనుమతులు ఇవ్వొద్దంటూ కొమిరి, వెంకటాపురం గ్రామస్తుల వేడుకోలు

ప్రజాశక్తి- రేగిడి

మండలంలోని కొమిరి వెంకటాపురం గ్రామ సమీపం నాగావళి నదిలో ఇసుక ర్యాంపు నిర్వహణకు అధికారులు అనుమతులు ఇస్తే ధర్నాలు తప్పవని కొమిరి, వెంకటాపురం గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు సోమ, మంగళవారాల్లో గ్రామాల రామ మందిరంలో గ్రామ పెద్దలు యువతతో ఇసుక ర్యాంపు వద్దంటూ చర్చలు జరిపారు. ఇక్కడ ఇసుక ర్యాంపు నిర్వహణ చేస్తే భారీ మూల్యం చెల్లించుకోవలసిందేనని గ్రామస్తులు వాపోయారు. ఇసుక ర్యాంపు వల్ల గ్రామంలో సిసి రోడ్లు, తాగునీటి కుళాయిలు, ఇతర ప్రభుత్వ కాలువ కల్వర్టులు శిథిలమయ్యే ప్రమాదం ఉందని గ్రామస్తులు ఆవేదన చెందుతున్నారు. గతంలో ఉమ్మడి శ్రీకాకుళంలో అప్పటి అధికారులు ఇసుక ర్యాంప్ పై విచారణ చేయకుండా అనుమతులు ఇవ్వడంతో చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నామని చెబుతున్నారు. కొమిరి వెంకటాపురం ఇసుక ర్యాంపు వల్ల గ్రామాల్లో ఉన్న సిసి రోడ్లు మలుపులు, ఎన్నో గృహాలు దెబ్బ తిన్నాయని గుర్తు చేశారు. గ్రామస్తులమంతా ఇసుక ర్యాంపు వద్దంటూ ధర్నాలు చేశామని, పోలీస్, జిల్లా, డివిజన్ అధికారులు వచ్చి పరిశీలించారని ఇబ్బందులు ఉన్నాయని గ్రహించారని తెలిపారు. అయినప్పటికీ కొంత మంది అనుమతులు ఉన్నాయని చెబుతూ దౌర్జన్యంగా ర్యాంపు నిర్వహణ చేపట్టారని వీధుల్లో ఇసుక ట్రాక్టర్లు, లారీలు రాకుండా నిలుపుదల చేశామని చెప్పారు. ఇప్పుడు మరలా ఉమ్మడి విజయనగరం జిల్లాలో ఇక్కడ మరోసారి ఇసుక ర్యాంపు నిర్వహణకు ఆదివారం ఆగమేఘాల మీద ఆర్‌డిఒ బొడ్డేపల్లి శాంతి, డిఎస్‌పి మోహనరావు, మైన్స్ అధికారులు పరిశీలించడంపై గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న రెండు గ్రామాల ప్రజలు ఇదేమి చోద్యమని నివ్వెర పోయారు. ఒకే చోటకి చేరుకొని ఇసుక ర్యాంపు వద్దంటూ తీర్మానం చేసుకున్నారు. దిక్కరిస్తే పోరాటాలకు సిద్ధమని, వీధుల్లో నుంచి రానివ్వమని ముక్తకంఠంగా ఏకమయ్యారు. ర్యాంపు నిర్వహణకు వైసిపి నాయకులు కంకణం కట్టుకున్నారని ఇసుక ర్యాంపు నిర్వహణ చేస్తే ఖబడ్దారని హెచ్చరించారు.

ఇసుక ర్యాంపు వద్దని తీర్మానం చేస్తున్న ప్రజలు

కరాటే సాధనతో మనోధైర్యం

ప్రజాశక్తి-లక్కవరపుకోట

కరాటే సాధనతో ప్రతి ఒక్కరిలోను మనోధైర్యం పెంపొందుతుందని ఎంఇఒ సిహెచ్ కూర్మారావు అన్నారు. కర్ణాటక రాష్ట్రం చిత్రదుర్గ జిల్లాలో ఇటీవల నిర్వహించిన జాతీయ స్థాయి కరాటే పోటీలో మండలంలోని స్వామి వివేకానంద ఇంగ్లీష్ మీడియం పాఠశాల నుండి 4వ తరగతి చదువుతున్న విద్యార్థిని షేక్ తనీషా 12సంవత్సరాల కేటగిరిలో 35 కేజీల (మహిళలు) విభాగంలో పాల్గొని కుమ్మిటి (ఫైటింగ్)లో బంగారు పతకం సాధించింది. కాటాస్‌లో రజిత పతకంతో పాటు బెస్ట్ డిఫెండర్‌గా ట్రోఫీని కైవసం చేసుకున్న సంగతి పాఠకులకు విధితమే. ఈ సందర్భంగా ఆ పాఠశాలలో మంగళవారం ఏర్పాటు చేసిన అభినంద సభ నిర్వహించి పాఠశాల కరస్పాండెంట్ బెహరా పురుషోత్తమరావు, ఏఎస్ఐ గోవిందరావు, శ్రీనివాసరావులతో ఎంఇఒ కలిసి తనీషాను ఘనంగా సన్మానించారు. కరాటే కోచ్ రాజు మాస్టర్‌ను ఈ సందర్భంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో విక్టరీ షుటోకాన్ కరాటే అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి (హైదరాబాద్) కె ప్రసాదగౌడ్, ఆ పాఠశాలల హెడ్ మాస్టర్ ప్రసాద్, మాధవి, చదరం స్వాతి, ఛాయాదేవి, ఝాన్సీ, అధ్యాయపక బృందం, విద్యార్థులు, తల్లితండ్రులు తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌కోట : తనీషాను సత్కరిస్తున్న ఎంఇఒ కూర్మారావు

సత్య కళాశాల విద్యార్థులకు పతకాలు

విజయనగరం టౌన్ : తోటపాలెంలోని సత్య డిగ్రీ, పీజీ కళాశాలలో పవర్ కిక్ బాక్సింగ్ అసోసియేషన్ కోచ్ సంతోష్ ఆధ్వర్యంలో శిక్షణ పొందుతున్న విద్యార్థుల్లో పలువురు ఇటీవల పార్వతీపురంలో జరిగిన రాష్ట్ర అమెచ్యూర్ కిక్ బాక్సింగ్ ఛాంపియన్ షిప్ పోటీలలో పతకాలు సాధించారు. ఐదుగురు విద్యార్థులు బంగారు పతకాలు, ముగ్గురు రజిత పతకాలు పొందారు. ఈ పోటీలను పార్వతీపురం కిక్ బాక్సింగ్ అసోసియేషన్, మినిస్ట్రీ ఆఫ్ యూత్ అఫైర్స్ స్పోర్ట్స్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా, ఇండియన్ ఒలింపిక్ అసోసియేషన్, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా సంయుక్తంగా నిర్వహించారు. బంగారు పతకాలు సాధించిన వారిలో యు.దుర్గారవి, ఎ. చంద్ర మౌళి, ఆర్. వంశీవరుణ్, పి.భార్గవ్, ఎన్.మధు, రజిత పతకాలు సాధించిన వారిలో పి. హేమంత్, కె.శివగణేష్, వై.భూలోక్ ఉన్నారు. కళాశాలలో ఏర్పాటు చేసిన అభినందన సభలో కళాశాల సంచాలకులు డాక్టర్ ఎం శశి భూషణ రావు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం వి సాయి దేవ మణి, కళాశాల ఎన్ సి సి ఆఫీసరు ఎం. ఉదయ్ కిరణ్ అభినందించారు.

ఆరోగ్య సురక్షను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి- నెల్లిమర్ల

ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి బి. భాస్కర రావు అన్నారు. మంగళ వారం పెద బూరాడ పేటలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. శిబిరంలో 383 మంది రోగులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బెల్లాన అప్పయ్యమ్మ, తుమ్మల పేట పిఎసిఎస్ అధ్యక్షులు కోట్ల పైడి నాయుడు, నాయకులు బెల్లాన రామారావు, ఎంపిడిఒ జి.రామారావు, కొండ వెలగాడ పిహెచ్‌సి వైద్యులు వై.ధనుంజయ్, పివి శిరీష, ఎంపి హెచ్ ఓ జి. అప్పలనాయుడు పాల్గొన్నారు.

డెంకాడ: మండలంలోని అమకాం గ్రామంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శబిరాన్ని నిర్వహించారు. ఉప సర్పంచ్ దిండి కోటి ఈ శిబిరాన్ని ప్రారంభించారు. శిబిరంలో ఇద్దరు స్పెషలిస్టు వైద్యులు చాణుఖ్య, శ్రీనువాస్, మోపాడ వైద్యాధికారి పివివి యోగితాబాల 279 మంది రోగులకు వైద్య సేవలు అందించారు. ఇందులో 20 మందికి కంటి పరీక్షలను పిఎంఒ మజ్జి గణపతిరావు చేశారు. అనంతరం అవసర మైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, మోపాడ పిహెచ్‌సి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వేపాడ: మండలంలోని సోంపురంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని సర్పంచ్ మురిపిండి గంగరాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. వైద్యాధికారులు డాక్టర్ పి.శివాని, డాక్టర్ బి. శ్రీసత్య శ్రీనివాస్, డాక్టర్ బి. మౌనిక వైద్య సేవలు అందించారు. అనంతరం ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ వైద్య శిబిరంలో బొద్దాం పిహెచ్‌సి వైద్య సిబ్బంది, గ్రామ సచివాలయ ఏఎన్ఎం, ఆశ వర్కర్, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

నెల్లిమర్ల: వైద్యులతో మాట్లాడుతున్న డిఎంహెచ్ఒ

అధికారంలోకి వస్తే ఇండోర్ స్టేడియం పూర్తి

ప్రజాశక్తి- చీపురుపల్లి

టిడిపి అధికారంలోనికి రాగానే అసంపూర్తిగా ఉన్న ఇండోర్ స్టేడియంను పూర్తి చేసి చీపురుపల్లి ప్రాంత యువతకు అందజేస్తామని టిడిపి విజయనగరం పార్లమెంటు అధ్యక్షుడు కిమిడి నాగార్జున అన్నారు. పట్టణ పరిధిలోని ఫైర్ స్టేషన్ వెనుక ఉన్న ఇండోర్ స్టేడియం ప్రాంతాన్ని రౌతు కామునాయుడు, పైలబలరాం, జనసేన నాయకుడు విసినిగిరి శ్రీనివాసరావులతో కలసి ఆయన మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడున్న యువతతో నాగార్జున మాట్లాడారు. గత టిడిపి ప్రభుత్వంలో కిమిడి మృణాళిని మంత్రిగా ఉన్నప్పుడు ఈ ప్రాంత యువత కోసం సుమారు రెండు కోట్ల రూపాయలతో ఇండోర్ స్టేడియంను మంజూరు చేసి పనులు ప్రారంబించారన్నారు. ప్రభుత్వం మారి వైసిపి అధికారంలోకి వచ్చిన తరువాత ఇండోర్ స్టేడియం పనులను నిలిపివేసారన్నారు. చీపురుపల్లి ఎమ్మెల్యేగా గెలిచి రాష్ట్ర మంత్రి అయిన తరువాత కూడా బొత్స సత్యనారాయణ ఇండోర్ స్టేడియంని గాలికొదిలేయడం ఏమిటని ప్రశ్నించారు. వచ్చే ఎన్నికలలో తాను ఎమ్మెల్యేగా గెలిచి టిడిపి అధికారంలోకి రాగానే స్టేడియం నిర్మాణ పనులను పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. మంత్రి అలసత్వం వల్ల జిల్లా, నియోజవర్గంలో అభివృద్ధి పూర్తిగా కుంటిపడిందని ఎక్కడ పనులు అక్కడ పడకేశాయని అని విమర్శించారు. నాగార్జున వెంట టిడిపి నాయకులు దన్నాన రామచంద్రుడు, సారేపాక సురేష్ బాబు తదితరులున్నారు.



యువతతో మాట్లాడుతున్న నాగార్జున

మిమ్స్ యాజమాన్యం మొండివైఖరి వీడాలి

సిఐటియు రాష్ట్ర ప్రధాన నర్సింగరావు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

మిమ్స్ యాజమాన్యం మొండి వైఖరి విడనాడి ఉద్యోగులు, కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సి.హెచ్. నర్సింగరావు డిమాండ్ చేశారు. స్థానిక ఆర్ఒబి వద్ద మిమ్స్ ఉద్యోగులు, కార్మికులు తమ సమస్యలు పరిష్కరించాలని గత 13రోజులుగా చేస్తున్న నిరశన శిబిరాన్ని మంగళవారం ఆయన సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిమ్స్ యాజమాన్యం గత మూడు సంవత్సరాలుగా చేస్తున్న కక్ష సాధింపు చర్యలు, వేధింపులు, దుర్మార్గాలకు విసిగి వేసారి పోయి ఉద్యోగులు, కార్మికులు సిఐటియుని ఆశ్రయించారన్నారు. ముఖ్యంగా సిఐటియుకి రెచ్చగొట్టే అవసరంలేదని ఉద్యోగులు, కార్మికులు సిఐటియు తలుపు తడితే వచ్చారని మిమ్స్ యాజమాన్యం గుర్తుంచుకోవాలని హితవు పలికారు. సిఐటియుని ఉద్యోగులు, కార్మికులు వద్దంటే వెళ్ళిపోతుంది గాని మిమ్స్ యాజమాన్యం వెళ్ళిపొమ్మని, రమ్మని చెబితే కుదరదని హెచ్చరించారు. కాబట్టి యాజమాన్యం వెంటనే స్పందించి ఉద్యోగులు, కార్మికుల సమస్యలు పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఉద్యోగుల న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం జిల్లా వ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ఉద్యమంలో బాగంగా అవాంఛనీయ సంఘటనలు జరిగితే మిమ్స్ యాజమాన్య భాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. దీనిలో భాగంగా ఈ నెల 14న జిల్లాలోని అన్ని ప్రజాసంఘాలు, కార్మిక సంఘాలను కూడ గట్టి ఎన్‌పిఆర్ భవనంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తామని 19న జిల్లా వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడతామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తమ్మినేని సూర్య నారాయణ, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి. శంకర రావు, కె.సురేశ్, జిల్లా నాయకులు వి .రాములు, టివి రమణ, ఎ. జగన్ మోహన్ రావు, జి. అప్పల సూరి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిహెచ్ నర్సింగరావు

శంఖారావం సభకు తరలిరండి

ప్రజాశక్తి - కొత్తవలస

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఈ నెల 17న వేపాడ మండలం సోంపురం జంక్షన్ లేఔట్‌లో నిర్వహించనున్న శంఖారావం సభను విజయవంతం చేయాలని నియోజకవర్గ టిడిపి ఇంచార్జి కోళ్ల లలిత కుమారి పిలుపునిచ్చారు. ఆమె కార్యకర్తలతో మంగళవారం మాట్లాడుతూ నియోజకవర్గంలో ఉన్న ఐదు మండలాల్లో వివిధ హోదాల్లో ఉన్న టిడిపి నాయకులు, కార్యకర్తలు ఈ సభకు హాజరవ్వాలన్నారు. ఈ సమావే శంలో టిడిపి నాయకులు ఎల్లపు సూరిబాబు, మాకిన సీతారామపాత్రుడు (నవీన్), వీరభద్రపురం, పొట్నూరు వేంకట రత్నాజీ, కోళ్ల వెంకటరమణ (శ్రీను), బొబ్బిలి అప్పారావు మాస్టర్, లాలం అర్జునరావు, కొరుపోలు అప్పారావు, జనసేన నాయకులు, కార్యకర్తలు, యువత పాల్గొన్నారు.

మెరక ముడిదాం: ఈ నెల 15న చీపురుపల్లిలో లోకేష్ నిర్వహించనున్న శంఖారావం సభకు మండలం నుండి టిడిపి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనాలని నియోజక వర్గ టిడిపి ఇంచార్జ్ కిమిడి నాగార్జున అన్నారు. మంగళవారం స్థానిక టిడిపి కార్యాలయంలో టిడిపి మండల అధ్యక్షులు తాడ్డి సన్యాసినాయుడు ఆధ్వర్యంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సభను విజయవంతం చేయటానికి ప్రతి ఒక్కరూ కంకణం కట్టుకోవాలన్నారు. ఈ సమావేశంలో టిడిపి నాయకుల కె. ధనంజయ, సిహెచ్ శ్రీరామ్, పి. సన్యాసినాయుడు, సీతారాం రాజు, పైడన్న, బంగారునాయుడు తదితరులు పాల్గొన్నారు.

విజయనగరం కోట: ఈనెల 16న విజయనగరంలో జరిగే టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్ శంఖారావం సభను విజయవంతం చేయాలని నియోజకవర్గ ఇన్‌ఛార్జి పూసపాటి అదితి గజపతిరాజు కోరారు. మంగళవారం అశోక్‌బంగ్లాలో నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ సభను విజయవంతం చేసేందుకు కృషి చేయాలని కోరారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు, పట్టణ అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్, విజయనగరం మండల పార్టీ అధ్యక్షులు బొద్దల నర్సింగరావు, కార్యదర్శి గంటా పోలినాయుడు, రాష్ట్ర బీసీ నాయకులు వేచలపు శ్రీనివాసరావు, నాయకులు రాజేష్ బాబు, కంది మురళి నాయుడు, కనకల మురళీమోహన్, కొంద్రు శ్రీనివాసరావు, అనురాధ బేగం, విజ్జపు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బిసి గురుకులంలో ప్రవేశాలకు దరఖాస్తులు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

ఎంజెపి బిసి గురుకుల పాఠశాలో 5వ తరగతి ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఎంజెపి బిసి గురుకుల పాఠశాలల జిల్లా కన్వీనర్, ప్రిన్సిపాల్ సిహెచ్ రామమోహిని మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 5వ తరగతి 2024-25 విద్యా సంవత్సరం ఇంగ్లీష్ మీడియం ప్రవేశానికి దరఖాస్తులు చేసుకోవాలన్నారు. బిసి విద్యార్థులు 9 నుంచి 11 సంవత్సరాలు దాటకుండా, ఎస్‌సి, ఎస్‌టి విద్యార్థులు 9 నుంచి 13సంవత్సరాలు దాటకుండా ఉండాలన్నారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో చదివి ఉండాలని లక్ష ఆదాయం మించరాదని చెప్పారు. వచ్చే నెల 1 నుంచి 31 వరకు అర్హులైన వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఉమ్మడి జిల్లాలో బాలికలకు నెల్లిమర్ల, గంట్యాడ, కొత్తవలస, జమ్మాదేవిపేట, సాలూరు, పార్వతీపురం పాఠశాలల్లో 320 సీట్లు కేటాయించి నట్లు తెలిపారు. బాలురకు నెల్లిమర్ల మత్స్యకార గురుకుల పాఠశాల, గజపతినగరం (కొరపు కొత్తవలస), విజయనగరం (జమ్మునారాయ ణపురం), బొబ్బిలి (కారాడ), కురుపాంలో 320సీట్లు కేటాయించా మన్నారు. ప్రవేశం పొందిన విద్యార్థులకు నాణ్యమైన విద్య, ఐఐటి శిక్షణ, ఉచిత వసతి, డిజిటల్ విద్య, ఆంగ్లంలో నైపుణ్యమైన బోధనలుంటా యన్నారు. అర్హులైన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

బహిరంగ వేలం ప్రకటన

ఆర్ & బి శాఖ, విజయనగరం వారు M.S Iron Steel Scrap బహిరంగ వేలం వేయుచున్నారు. తారీఖు: 16-02-2024 సమయం: మధ్యాహ్నం 2:30 గంటలకు, స్థలం - పాత జిల్లా జడ్జి కోర్టు ఆవరణములో, వి.టి.అగ్రహారం, విజయనగరం టౌన్. ఇతర వివరముల కొరకు కార్యనిర్వాహక ఇంజనీర్, ర.భ.శాఖ, డివిజన్, విజయనగరం. ఫోన్ నెంబర్ : 9440818239 సంప్రదించవలెను.